## ఓటు హక్కు వజ్రాయుధం

### ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మణుగూరు టౌన్, మార్చి 20: రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు అని పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బుధవారం ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు పోలీస్, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో మణుగూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ మాట్లాడారు. ఓటు హక్కు నమోదు చేయించుకోని 18 సంవత్సరాలు పైబడిన యువత ఓటు హక్కు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పినపాక అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించకపోతే సమ్మెకు దిగుతాం



ఆస్పత్రి ఎదుట సిబ్బంది

ఇల్లెందు రూరల్, మార్చి 20 : వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని స్టాఫ్ నర్సు రోజ, ఏఎన్ఎం శ్రీలత అన్నారు. బుధవారం మండలంలోని కొమరారం పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన 3నెలల వేతనాలు, 7నెలల పీఆర్‌సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. వేతనాలు చెల్లించకుండా జాప్యం చేస్తే ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామన్నారు. నో పే నో వర్క్ ప్రకారం విధులను బహిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జోగా లక్ష్మి పాల్గొన్నారు.

## కాటేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో ఆలయ అధికారులు

భద్రాచలం, మార్చి 20: భద్రాచలం సీతారామ చంద్రస్వామికి నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) యాజమాన్యం సుమారు రూ.కోటి వ్యయంతో రంగనాయకుల గుట్టపై కాటేజీ నిర్మించనున్నది. దీనికి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి భూమిపూజ చేశారు. దేవస్థానం మాజీ ఈవో రామకృష్ణంరాజు దంపతులు పాల్గొన్నారు. అలాగే దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఏపీలోని గుంటూరుకు చెందిన పి.నాగ మారుతికుమారి అనే దాత బుధవారం రూ.1,11,911 విరాళంగా ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్ల దోపిడీ

అశ్వారావుపేట, మార్చి 20 : రివార్డు వచ్చింది అంటూ ఓ లింక్ పంపి ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలో సైబర్ నేరగాళ్లు నగదు డ్రా చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బోల్లేపల్లి సత్యనారాయణ రాజు వాట్సప్ నెంబర్‌కు ఈ నెల 13వ తేదీన రివార్డు వచ్చిందని సైబర్ నేరగాళ్లు ఎస్‌బీఐ లింక్ పంపించారు. లింక్ ఓపెన్ చేయగానే కొద్ది సేపటికే సైబర్ అతని బ్యాంక్ ఖాతా నుంచి మూడు విడతల్లో రూ.50 వేలు డ్రా చేసేశారు. నగదు డ్రా చేసుకున్నట్లు బ్యాంక్ నుంచి అతడికి మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంక్ అధికారులకు ఫోన్ ద్వారా తన బ్యాంక్ ఖాతా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు సమాచారం ఇచ్చారు. అధికారులు బాధితుడి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేశారు. దీనిపై బుధవారం సైబర్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తినట్లు ఎస్సై శ్రీరాములశ్రీను తెలిపారు.

# నాలుగు వైన్ షాపుల్లో మద్యం లూటీ



వైన్‌షాపులోకి దూసుకెళ్తున్న గ్రామస్తులు



వైన్ షాపు సిబ్బందిని విచారిస్తున్న డీఎస్పీ చంద్రభాను

- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తుండడంతో మద్యం ప్రియుల ఆగ్రహం
- భద్రాద్రి జిల్లా టేకులపల్లిలో ఘటన

టేకులపల్లి, మార్చి 20: వైన్ షాపుల యాజమాన్యాలు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆగ్రహించి గ్రామస్తులు మద్యం సీసాలను లూటీ చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండల కేంద్రంలో మొత్తం నాలుగు వైన్ షాపులు ఉన్నాయి. బుధవారం ఉదయం 10 గంటల తర్వాత దుకాణాలు తెరుచుకున్నాయి. కొందరు గ్రామస్తులు దుకాణానికి వెళ్లారు. నాలుగు దుకాణాల్లో సిబ్బంది ఒక్కో క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యాలు బ్రాండెడ్ మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నారని, దొరికే మద్యాన్నైనా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దీంతో వైన్ షాపుల వద్ద పరిస్థితి ఉద్రిక్తత ఏర్పడింది. ఆందోళనకారుల ఆగ్రహావేశాలతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఇదే అదునుగా భావించిన గ్రామస్తులు నాలుగు షాపుల్లో సుమారు రూ.40 లక్షల విలువైన మద్యం సీసాలను లూటీ చేశారు. కొందరు ఒకటి రెండు సీసాలను తీసుకెళ్లగా మరికొందరు కాటన్ల కొద్దీ సీసాలను తమ ఇళ్లకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్, ఇల్లెందు సీఐ కరణాకర్ పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చారు. వైన్ షాపుల యాజమాన్యాల ఫిర్యాదుల మేరకు విచారణ ప్రారంభించారు. షాపుల వద్ద ఉన్న సీసీ కెమెరాలు, ప్రత్యక్ష సాక్షుల విచారణ అనంతరం పోలీసులు పూర్తి వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

# మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడి లొంగుబాటు

### వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు



పునరావస చెక్కు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, మార్చి 20 : మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు బుధవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని చర్ల మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన మడివి బుద్ర అలియాస్ కృష్ణ 2010వ సంవత్సరంలో చర్ల ఏరియా కమిటీలో చేరి 2015 వరకు దళ సభ్యుడిగా పనిచేశాడు. అక్కడి నుంచి పదోన్నతి పొందిన బుద్ర తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ ప్రెస్ టీమ్ బాధ్యతలను నిర్వహించాడు. మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులైన యేపె హరిభూషణ్, బండి ప్రకాష్, బడే దామోదర్ వంటి అగ్ర నాయకుల దగ్గర పనిచేస్తూ మావోయిస్టు పార్టీకి సంబంధించిన విప్లవ సాహిత్యాన్ని, ప్రెస్ నోట్లను, కరపత్రాలను తయారు చేస్తుండేవాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు ఆకర్షితుడై బుద్ర స్వచ్ఛందంగా అధికారుల ఎదుట లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుద్రపై రూ.4 లక్షల రివార్డు ప్రకటించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన వారెవరైనా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొస్తే ప్రభుత్వం తరపున అన్ని ప్రయోజనాలను అందజేస్తామని తెలిపారు.

## మహిళలు బాగుంటేనే మెరుగైన సమాజం

### డీడబ్ల్యూవో విజేత



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న డీడబ్ల్యూవో విజేత

చుంచుపల్లి, జనవరి 20: మహిళలు బాగుంటేనే సమాజం బాగుంటుందని ఐసీడీఎస్ డీడబ్ల్యూవో విజేత పేర్కొన్నారు. మండలంలోని కిన్నెరస్టీల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. వీటి ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. సీడీపీవో సలోమి, చుంచుపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ భవాని, పోషణ్ పక్వాడ్ సూపర్‌వైజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

## వృక్ష భక్షకుడికి భలే శిక్ష..

భద్రాచలం, మార్చి 20: కొన్ని రోజుల కిందటి ముచ్చట ఇది. భద్రాచలంలోని చర్ల రోడ్డులో బజాజ్ షోరూం ముందు భాగాన మూడు పెద్ద పెద్ద పొగడ చెట్లు ఉండేవి. వాటి నీడన ఎందరో సేద తీరేవారు. హరిత ప్రియులైన 'గ్రీన్ భద్రాద్రి' సభ్యులు దాదాపుగా పదేళ్ల క్రితం నాటిన చిన్న మొక్కలే.. ఇలా వృక్షాలుగా ఎదిగాయి. కొన్ని రోజుల కిందట ఈ మూడు చెట్లను ఓ వ్యక్తి నరికించాడు. ఆ తర్వాత ఈ విషయం తెలుసుకున్న 'గ్రీన్ భద్రాద్రి' తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు లోనయ్యారు. 'కంటికి కన్ను.. పంటికి పన్ను.. చెట్టుకు చెట్టు..– ఇదే తగిన శిక్ష' అనుకున్నట్టున్నారు. ఆ వ్యక్తితోనే కడియం నర్సరీ నుంచి మూడేళ్ల వయసున్న, పది అడుగులు ఎత్తున్న మూడు మొక్కలను తెప్పించారు. అతడితోనే వాటిని బుధవారం నాటించారు. 'గ్రీన్ భద్రాద్రి' సభ్యులు రాంబాబు, కృష్ణ, నాగ సూర్యనారాయణ, భూపతిరావు, కృష్ణార్జునరావు పాల్గొన్నారు. 'వృక్ష భక్షకుడికి తగిన 'శిక్ష' వేయించారు..' అంటూ, వారిని పట్టణ ప్రముఖులు అభినందించారు.

## బాలికపై లైంగిక దాడి: పోక్సో కేసు నమోదు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20 (నమస్తే తెలంగాణ): బాలికపై ఓ బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన బుధవారం భద్రాద్రి జిల్లాలో వెలుగు చూసింది. తెలిసిన వివరాల ప్రకారం.. సుజాతనగర్ మండలానికి చెందిన ఓ బాలికపై ఇదే మండలానికి చెందిన ఒక బాలుడు ఇటీవల లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు బుధవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. బాధితురాలిని కొత్తగూడెంలోని స్వధార్ హోంకు తరలించారు.

# సంక్షిప్తం

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, మార్చి 20 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విస్వసనీయ సమాచారం మేరకు మండలంలోని బూర్గుడెంలో ఎటువంటి అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## పోషకాహారలోపాన్ని అధిగమించాలి

అశ్వారావుపేట రూరల్, మార్చి 20 : ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేయడానికి స్థిరమైన ఆహార వ్యవస్థలను రూపొందించడమే ఎస్‌ఎఫ్‌ఎస్‌హెచ్‌సీ(సస్టైనబుల్ ఫుడ్ సిస్టం ఫర్ హైల్లీ కమ్యూనిటీస్)లక్ష్యం అని ప్రభుత్వేతర సేవా సంస్థ వాసన్ ఎస్‌పీవో అనిల్ ఉప్పలపాటి తెలిపారు. బుధవారం మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీలో వైద్యులు రాందాసు నాయక్, దీపక్‌రెడ్డిలతో సంస్థ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పథకం కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి, న్యూట్రీషియనిస్టు శిరిష పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

ఇల్లెందు రూరల్, మార్చి 20 : పార్లమెంటు ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. బుధవారం మండలంలోని రోంపేడు, నెహ్రూనగర్, లలితాపురం తదితర చోట్ల వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ.. కోడ్ నేపథ్యంలో ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు మొత్తాన్ని తీసుకొని ప్రయాణించరాదన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే దేనికి సంబంధించిన ఆధారాలను పోలీసులకు రుజువు చేయాలన్నారు.

## డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

భద్రాచలం, మార్చి 20: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ (లైఫ్ సైన్స్) తృతీయ సంవత్సం విద్యార్థులు బుధవారం చొప్పల గ్రామంలో క్షేత్ర పర్యటనకు వెళ్లారు. దేవర్లగుట్టపై వృక్ష వైవిధ్యాన్ని, దామరవాయిలోని మూడు వేల ఏళ్ల నాటి బృహత్ శిలా యుగపను సమాధులను, రామప్ప చెరువును సందర్శించారు. ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, అధ్యాపకులు ఎస్.శ్యామ్ ప్రసాద్, డాక్టర్ ఎన్.నాగ సమీరా, డాక్టర్ ఎ శ్రీను పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ చైర్మన్‌గా 'అల్లాడి'

దుమ్ముగూడెం, మార్చి 20: స్థానిక ముత్యాలమ్మ ఆలయ చైర్మన్‌గా దుమ్ముగూడెం గ్రామస్తుడు అల్లాడి వెంకటేశ్వరరావును బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన స్టీరింగ్ కమిటీ, గ్రామస్తుల సమావేశం ఎన్నుకుంది. స్టీరింగ్ కమిటీ సభ్యులు శీరపు రమణారెడ్డి, కొత్తూరు సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

## 'హమాలీలకు అన్ లోడింగ్ పనులివ్వాలి'

పాల్వంచ, మార్చి 20: పట్టణంలోని రిలయన్స్ స్టోర్‌లో అన్‌లోడింగ్ పనులను స్థానిక హమాలీలకే కేటాయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. రిలయన్స్ స్టోర్ తెరవక ముందే అక్కడికి చేరుకున్న హమాలీలు, వారి కుటుంబ సభ్యులు.. స్టోర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అన్ లోడింగ్ పనులను స్థానికులకే ఇస్తామని గతంలో రిలయన్స్ స్టోర్ బాధ్యులు హామీ ఇచ్చి నెరవేర్చకపోవడంతో ఆందోళన చేస్తున్నామని అన్నారు. పట్టణ ఎస్సై బాణాల రాము అక్కడికి చేరుకుని హమాలీలు, రిలయన్స్ సోర్ట్ బాధ్యులతో చర్చించారు. దీంతో హమాలీలు తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

## ఉద్యోగాల వయోపరిమితిని పెంచాలి

మణుగూరు టౌన్, మార్చి 20: సింగరేణి సంస్థలో ఉద్యోగ నియామకాల కోసం యువత వయోపరిమితిని 45 సంవత్సరాలకు పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి, విద్యార్థి జేఏసీ కన్వీనర్ దుర్గ్యాల సుధాకర్ కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు 45 సంవత్సరాల వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కానీ సింగరేణి సంస్థ మాత్రం 35 సంవత్సరాలకు పరిమితమైందన్నారు. సింగరేణి ఉద్యోగ అవకాశాల్లో వయోపరిమితిని పెంచాలని కోరారు. సమావేశంలో సోందె కుటుంబరావు, బాడిశ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో హోలీ సందడి

కరకగూడెం, మార్చి 20: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ సందడి మొదలైంది. భట్టుపల్లి పంచాయతీ కల్వలనాగారంలోని మహిళలు ఈ నెల 25న హోలీ జరుపుకునేందుకు ముందస్తుగా ప్రతి ఇంటికి తిరుగుతూ కోలాటం వేస్తూ ఆటపాటలతో సందడి చేస్తున్నారు.

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి స్థల పరిశీలన

మణుగూరు టౌన్, మార్చి 20: మణుగూరు మండలం ముత్యాలమ్మనగర్ పంచాయతీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం కోసం టాటా కంపెనీ ప్రతినిధుల బృందం బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఆధనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం తీసుకున్న నిర్ణయంలో భాగంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి కావాల్సిన వసతులపై చర్చించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి బసవరాజు, ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు రూ.272 ఇవ్వాలి

సారపాక, మార్చి 20: ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.272 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సారపాక పుష్పరవనం వద్ద ఆయన ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు కల్పించి సరైన కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## డ్రైనేజీపై అక్రమ నిర్మాణం

### తొలగించిన సిబ్బంది

సారపాక, మార్చి 20: నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీపై అక్రమంగా నిర్మాణం చేపట్టగా పంచాయతీ అధికారులు బుధవారం తొలగించారు. సారపాకలోని గాంధీనగర్‌లో ఓ ఇంటి వద్ద డ్రైనేజీపై అక్రమంగా నిర్మాణం చేపట్టారు. కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ఈవో కంది మహేష్ స్పందించి పంచాయతీ సిబ్బంది చేత అక్రమ నిర్మాణాన్ని తొలగించారు.

## 'నకిలీ విత్తనాల విక్రేతలపై చర్యలు తీసుకోవాలి'

పాల్వంచ, మార్చి 20: నకిలీ విత్తనాల విక్రేతలపై చర్యలు తీసుకోవాలని రైతులు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. పాల్వంచ మండలం బంద్రుగొండ గ్రామంలో వరి రైతులకు కొందరు వ్యాపారులు వరి విత్తనాలు విక్రయించారని, రైతులు వాటిని నాటినప్పటికీ ఇంత వరకూ అవి కంకులు వేయలేదని అన్నారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని పొలాలను మాస్‌లైన్ నాయకులు పరిశీలించారు. నకిలీ వరి విత్తనాల కారణంగా 25 ఎకరాల్లో పంటలు కంకులు వేయలేదని, ఎకరానికి సుమారు రూ.30 వేల మేర రైతులకు నష్టం వాటిల్లిందని అన్నారు.

## 'ఈ-వేస్ట్ మెనేజ్‌మెంట్'పై 'అనుబోస్'లో సదస్సు

పాల్వంచ, మార్చి 20: 'ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై పట్టణంలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) బాధ్యులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ రీసోర్స్‌పర్సన్ కరుణాకర్‌రెడ్డి హాజరై ఎలక్ట్రానిక్ వ్యర్థాల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల బాధ్యులు తలశిల భరత్, అవని, రవికుమార్, వెంకన్న, ఇమ్మడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా క్రీడా పోటీలు

పాల్వంచ, మార్చి 20: కేటీపీఎస్ ఏడో దశ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి వాలీబాల్, లాన్ టెన్నిస్ పోటీలు బుధవారం హోరాహోరీగా కొనసాగాయి. వాలీబాల్‌లో వైటీపీఎస్‌పై 25–10 తేడాతో కేటీపీఎస్ ఏడో దశ, జూరాలపై 25–17 తేడాతో కేటీపీఎస్ 5, 6 దశలు, పోశంపాడుపై 25–6 తేడాతో కేటీపీఎస్ ఏడో దశ, వైటీపీఎస్ (యాదాద్రి)పై 25–10 తేడాతో కేటీపీపీ విజయం సాధించాయి. అలాగే, లాన్ టెన్నిస్ సింగిల్స్‌లో కేటీపీఎస్ ఏడో దశ మొదటి స్థానం, కేటీపీఎస్ 5, 6 దశలు రెండు స్థానం, కేటీపీపీ (భూపాలపల్లి) మూడో స్థానం స్థానం సాధించాయి. అలాగే, డబుల్స్‌లో బీటీపీఎస్‌పై 6–4 తేడాతో కేటీపీపీ టీం, పోచంపాడుపై 6, 2 తేడాతో కేటీపీఎస్ 5, 6 దశలు, జూరాలపై 6, 2 తేడాతో కేటీపీపీ, పులిచంతలపై 6, 5 తేడాతో వైటీపీఎస్ విజయం సాధించాయి. ఈ పోటీలను కాంతారావు, వీరూనాయక్, వై.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కబీర్, ప్రకాశ్‌లు రిఫరీలుగా వ్యవహరిస్తున్నారు.

# భద్రాద్రి జిల్లాకు ఆధ్యాత్మిక శోభ

### పాత కొత్తగూడెం, 7 ఇంక్లైన్లలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



చుంచుపల్లి: భక్తులకు తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు



పాల్వంచ: కల్యాణ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చుంచుపల్లి, జనవరి 20: మండలంలోని 7 ఇంక్లైన్ గుట్టవద్ద గల శ్రీ వేంకటేశ్వరాస్వామి దేవాలయ బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీనివాస కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా విశ్వేక్షణ ఆరాధన నిర్వహించి అనంతరం కల్యాణ క్రతువును మొదలు పెట్టారు. వేదపండితుల తాత్సాంగం ద్వారా కల్యాణ విశిష్టతను వివరిస్తూ లక్ష్మీభూనిల అమ్మవార్లకు తాళిబొట్లు అలంకరించారు. సింగరేణి అధికారులు శాలెంరాజు, జక్కం రమేశ్, శ్రీనాథ్, పాలడుగు శ్రీనివాస్, బసవయ్య, జీకేవోసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమేశ్, వ్యాపారవేత్త తాటిపల్లి శంకర్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

**వేంకటేశ్వరస్వామి కల్యాణం..**

కొత్తగూడెం అర్బన్, మార్చి 20: మున్సిపాలిటీ పరిధిలోని పాత కొత్తగూడెంలో ఉన్న అలివేలు మంగ సమేత పద్మావతి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ బాధ్యులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ కల్యాణ క్రతువును జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

**కల్యాణ ప్రచార రథం ప్రారంభం..**

పాల్వంచ, మార్చి 20: పట్టణంలోని శ్రీనివాసగిరి కొండపై కాకతీయుల కాలం నాడు వెలిసిన అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఏప్రిల్ 4న జరుగనుండగా అందుకు సంబంధించిన ప్రచార రథాన్ని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రారంభించారు. తొలుత పట్టణ ప్రముఖుడు కొత్త వెంకటేశ్వర్లు లాంఛనంగా జెండా ఊపారు. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణాన్ని ఏటా వైభవంగా నిర్వహిస్తుంటామని, ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు ఏటా 10 వేల మందికిపైగా భక్తులు హాజరవుతుంటారని వివరించారు. భక్త సమాజ మండలి గౌరవ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వర్లు, ఆరుట్ల లక్షణ్, ధర్మపురి రాము, తాటికొండ శ్రీలత, ఊకే భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, బండి నారాయణ, ఏటుకూరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**సత్యమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం..**

అన్నపురెడ్డిపల్లి, మార్చి 20 : మండలంలోని జానకీపురం శ్రీసత్యమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు, అష్టోత్తర శతనామావళి, కుంకుమ పూజలు, మంత్రపుష్ప నీరాజనం, గ్రామోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

**రామాలయంలో గోటి తలంబ్రాలు..**

అన్నపురెడ్డిపల్లి, మార్చి 20 : మండలంలోని రాజాపురం శ్రీకోదండ రామాలయంలో గోటి తలంబ్రాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోటి తలంబ్రాలను భద్రాచలం రామాలయానికి పంపించనున్నట్లు భక్తులు తెలిపారు.

**సీతారాములు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం..**

అశ్వారావుపేట రూరల్, మార్చి 20 : మండలంలోని వినాయకపురంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠామహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాంబశివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయిలను ప్రతిష్ఠించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

**రణాసురుడి జాతర**

ఆళ్ళపల్లి, మార్చి 20: పాయం వారి ఇలావేల్పు అయిన శ్రీ రణాసురుడి జాతర బుధవారం నుంచి ప్రారంభమైందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 21న గురువారం రాత్రి నిండు జాతర జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రణాసురుడి దేవుడి దీవెనలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాయం నరసింహారావు, సత్యానారాయణ, రామనర్సయ్య పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, GADAMSETTI RAMYA, R/o. 1-63, Janampeta, Bhadradri Kothagudem, TS. Changed My Name as GADHAMSETTI LAXMI RAMYA, W/o. Rangarao. NT-328417

★I, CHEERLA TIRUPATI, R/o. 23-225/1-117, Road No. 2, Surya Nagar, Chunnambatti Wada, Mancherial, TS. Changed My Name as CHEERLA THIRUPATHI REDDY, S/o. Malla Reddy. NT-328417

★I, CHEERLA JYOTHI, R/o. 23-225/1-117, Road No. 2, Surya Nagar, Chunnambatti Wada, Mancherial, TS. Changed My Name as CHEERLA LALITHA, W/o. Thirupathi Reddy. NT-328417

HOUSE FOR SALE

★పాత పాల్వంచ మెయిన్ రోడ్డుకు దగ్గరలో 480 చ||గ||లలో డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు, స్థలం, తూర్పు ఫేసింగ్, రిజిస్ట్రేషన్ కలిగినది అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్ర|| 9849419886 KMM

INDUSIND BANK LTD.
LIGHT COMMERCIAL VEHICLE FOR SALE
1) BAJAJ RE CNG 4S FI BS VI, TS04UE1962, MODEL: 2022.
2) APE XTRA LDX+HD BS VI TS04UE2009, MODEL: 2022.
3) APE XTRA LDX+HD BS VI TS04UE2029, MODEL: 2022.
Cell:9959401146
PolasJuice Point Lane, ZP Centre Beside Sidhardha Hospitals,Khammam.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616